

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకి కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *టైం మేనేజ్‌మెంట్ అనే నా బద్ధకం కళ*

**టైం మేనేజ్ మెంట్ గురించి** నన్ను చాలామంది మిత్రులు అడుగుతుంటారు. కానీ నేను 'టైం మేనేజ్‌మెంట్' అని హెడ్డింగ్ పెట్టి, విషయసూచికలో వరుసగా అంశాలూ, ప్రణాళికలూ రాసి ఆ పుస్తకాన్ని మీ తలకి అంటగట్టాలి అనుకోవడంలేదు. సింపుల్‌గా చెప్పబోతున్నాను.

***1. "బలవంతంగా ఏదైనా మీద పడేవరకూ ఏవీ చెయ్యకండి"***

నా మటుకు నేను సెన్సార్ ఆఫీస్ నుండి ఈరోజు సెన్సార్ ఉంది అని ఫోన్ వస్తేనో, ప్రొద్దుటే షూటింగ్ ఉంటే అసిస్టెంట్ డైరెక్టర్ సీన్ పేపర్స్ కోసం వచ్చి డోర్‌బెల్ కొడ్తేనో, లేకపోతే మా ఆయన ఊళ్ళో ఉండి నాకంటే ముందే నిద్రలేచి, కావాలని నాలుగుసార్లు బెడ్‌రూం తలుపూ, కిటికీ తలుపులూ వేసి, తీస్తూంటేనో ఇంక తప్పదని నిద్రలేస్తాను. ఇది పాయింట్ నెం.1. తప్పనిసరి అంటేనే ప్రొద్దుటే నిద్రలేవడం.

ఈ రోజు వేలెంటైన్స్‌డే కూడా కాబట్టి మా వారి గురించి కాస్త ప్రేమగా నాలుగు విషయాలు చెప్తాను.



"పడుకో.. పడుకో.. నిన్ను లేపనులే. బ్రేక్ ఫాస్ట్ కూడా నేనే చేస్తాను. కాఫీ డికాషన్ అప్పుడే వేసేసా సరేనా?" అన్నారు ఓసారి.

"గుడ్‌బాయ్" అని నేను మళ్ళీ ముసుగుపెట్టే లోపు, ముసుగు లాగి "అటుకుల ఉప్మాకి ఎన్ని నీళ్ళు పొయ్యాలి?" అని అడిగారు

"అందలాల కుందలాల మీద అత్తగారిని తీసుకొస్తే తోటకూరకి ఎసరు ఎంత పెట్టాలి అందిట ఒకావిడ" అని విసుక్కుని "కడిగి పోపులో వెయ్యండి, నీళ్ళూ నిప్పులూ పొయ్యకూడదు" అన్నాను.

"సరే.. పడుకో" అన్నారు.

నేను మళ్ళీ సగంలో వదిలేసిన స్వప్నాన్ని పట్టుకోడానికి ఆ దారాన్ని వెతుక్కుంటుండగా, మళ్ళీ కళ్ళమీద వెలుగు. నెమ్మదిగా కళ్ళు తెరిస్తే ఈయన దరహాసం. ఆపైన సుందరవదనారవిందం.

"మళ్ళీ ఏవిటీ?"

"ఎండు మిరపకాయలు వెయ్యాలా? పచ్చి మిరపకాయలా?"

"ఒళ్ళు మండుతోంది నాకు."

"అయితే రెండు వెయ్యనులే. సరే పడుకో."

'అమ్మయ్యా' అని మళ్ళీ ముసుగు పెట్టేలోపు "ఎత్తిన్న వాటిల్ల సొన్నాలం ఉనకు అరివే కడియాద్."

సడెన్‌గా అదేవిటో ఈ భాష ఎందుకు మాట్లాడ్తున్నారో తెలీక ముసుగు తీస్తే, మా వారు టీ.వీ చూస్తున్నారు. ఆయన యమా సీరియస్‌గా అరవ ఛానెల్ ఎందుకు చూస్తున్నారో అర్థం కాలేదు. కావలసిన అవసరం లేదు. మళ్ళీ పడుకున్నా. ఒక్కోసారి బెంగాలీ కూడా చూస్తుంటారు.

"ఏయ్. నిన్నే" మళ్ళీ దుప్పటీ లాగారు.

"ఏంటీ?" విసుగ్గా అడిగాను.

"అరివే కడయాద్, అంటే?"

"బుద్ధి లేదా?"

"ఏయ్. ప్రొద్దుటే తిడ్తావేం?"

"అరివే కడయాదు అంటే అదీ అర్థం" అని మళ్ళీ ముసుగు పెట్టాను.

"ఉప్పు ఎంత వెయ్యాలో చెప్పి పడుకో ఉప్మాలో"

"ఒక చెంచా వెయ్యండి" అన్నాను.

"అలాగే.. కానీ పెద్ద చెంచానా, పోయిన నెల మన ఇంట్లో వ్రతం రోజు వంట బ్రాహ్మడు మరిచిపోయి వెళ్ళిపోయాడే దానితోనా? లేకపోతే నువ్వు కాఫీలో షుగర్ వేస్తావే దానితోనా? మనం పచ్చడిలో పప్పునూనె వేసుకుంటామే దానితోనా? లేకపోతే ఇడ్లీలు కుక్కర్ లోంచి తీస్తామే దానితోనా? చిన్నప్పుడు పిల్లలకి ఆముదం.." అంటుంటే నేను ముసుగు తీసేసి లేచి కూర్చుని "బుచ్చిబాబూ నేను హాయిగా ఇంకో గంట నిద్రపోవడం మీకు ఇష్టం లేదు.. అంతేనా?"

"కాదు నీకు హెల్ప్ చేద్దామనీ. ఆ తరువాత హాయిగా పడుకో. ముందు ఏం చెయ్యాలో చెప్పు."

"ఆ టీ.వీ కట్టేసి, స్టౌ ఆర్పేస్తే, నేనొచ్చి ఆ టిఫిన్ సంగతి చూసుకుంటాను. అవునూ ఏవిటీ వాసన?" ముక్కులు ఎగబీల్చాను.

"అయ్యో పాలుపెట్టి మరిచిపోయాను"

"మిల్క్ బాయిలర్‌లో పెట్టచ్చుగా"

"పెట్టచ్చనుకో కానీ నీకు డిస్టర్బెన్స్ అవుతుందనీ" పరమ దయగా చెప్పారు.

నేను తల కొట్టుకుని వంటింట్లోకి పరిగెత్తాను.

ఇలా ఉంటుంది ఆయన ఉన్నప్పుడు మనం లేట్‌గా లేవాలనుకుంటే. పాపం పడుకోమనే అంటారు. కానీ పడుకోలేం.

***2. టైంని సూచించే వేటి వంకా చూడరాదు***

ఇక రెండో పాయింట్ ఏవిటంటే, చిన్నప్పుడు రేడియోలో సంస్కృత పాఠం వస్తున్నా, వార్తలొస్తున్నా మా అమ్మ "వార్తలొస్తున్నాయి నిద్రలే" అనేది. నేను లేవకపోతే పార్లమెంట్ సమావేశాలు ఆగిపోయేట్లు.

"మీరు కోరిన పాటలు మొదలయ్యాయి. నడు బస్ మిస్ అవుతావు" అనేది.

"అసలు ఎవడు కోరాడు ప్రొద్దుటే ఈ పాటలు?" అని అరవాలనిపించేది. ఈలోగా "చీకటిలో కారు చీకటిలో.. కాలం అనే కడలిలో.. శోకం అనే పడవలో" అంటూ ఏదో ఏడుపు పాట మొదలయ్యేది. నేను పాటకి తగ్గ ముఖ భంగిమలతో తయ్యారయ్యేదాన్ని.

తరువాత్తరువాత టీ.వీ.లొచ్చాయి. అప్పుడూ టీ.వీ. చూస్తే "పాలూ చేలూ మొదలయింది.. మీ నాన్నకి ఆకలేసేవేళ త్వరగా కూర తరుగు" ఇలా అనమాట.

డాక్టర్ అయితే మా అమ్మకి "రుతురాగాలు టైంకి ఒకటీ, విజయదుర్గ వార్తలు చదివే వేళకి ఒకటీ రోజుకి రెండు మాత్రలు వేసుకో అమ్మా" అని చెప్పేవాడు.

ప్రొద్దుటే సంస్కృత వార్తలు వినే మా నాన్నని ఓసారి అడిగాను "నాన్నా నీకు సంస్కృతం వచ్చా? అర్థం అవుతుందా?"

"రాదు.. కాదు"

"మరి రోజూ ఎందుకు వింటావు?"

"నేను కూడా వినకపోతే, సంస్కృత వార్తలు చెప్పడం మానేస్తారు. ఆ భాష ఒకటుందని మీ తరువాతి తరాలకి తెలీదు. అందుకనీ! కాస్త వాల్యూం పెంచి వెళ్ళమ్మా. ఏదో పి.వి నరసింహారామ్ ...శృతతం.. స్వయంతా.. అంటున్నాడు!"

ఇలా ఉండేది. ఋతురాగాలయితే రెండు రాగాలు మధ్యలో అయ్యేటప్పటికి పిల్లలు స్కూల్ నుండి వచ్చేవాళ్ళు, వాళ్ళకి బిస్కెట్లు పెట్టి, పాలు కలిపివ్వడానికి వంటింట్లోకి వెళ్ళడానికి ఎంత ఒళ్ళు మండేదో. దిక్కుమాలిన స్కూల్ సరిగ్గా మధ్యలో ఉండగా అయ్యేది.

మా చిన్నాడు దాన్ని ‘బూతురాగాలు‘ అని చదివేవాడు.

ఇంతకీ, రేడియో, టీ.వీ, సెల్ ఫోన్‌లాంటి పరికరాలు దగ్గరుంచుకుని టైం గురించి ఆతృత పడకుండా, నింపాదిగా మన పనులు చేసుకోవాలి. ఒక్కోసారి ప్రొద్దుట పూట సెల్‌ఫోన్ సైలెంట్‌లో పెడితే ఇంకా సానుకూలంగా ఉంటుంది. గడియారం ఉన్న షో కేసు ముందు ఓ గ్లాసో, పూలకుండీనో పెట్టేస్తే అస్సలు టైం కనపడదింక. మనిష్టం వచ్చినంతసేపు తయ్యారవచ్చు.

ఒక్కోసారి మా ఫ్రెండ్ ప్రొద్దుటే ఫోన్ చేసి "ఇవాళ ఏం చేస్తున్నావే?" అంటుంది.

"టీ.వీ సీరియల్ సిట్టింగ్ ఉంది. తరువాత రైటర్స్ ఎసోసియేషన్‌లో మీటింగ్ ఉంది. మా భారతి జీ టీ.వీకి కథ గురించి తనతో రమ్మంది. సాయంత్రం త్యాగరాయగాన సభలో ఎవరో పాటల పోటీకి చీఫ్ గెస్ట్‌గా రమ్మన్నారు.. ఆ.. అన్నట్లు ఇవాళ ఈవెనింగ్‌కి డైలాగ్ ఇవ్వకపోతే షూటింగ్ ఆగిపోతుందని అసిస్టెంట్ డైరెక్టర్ వస్తానన్నాడు అంతే సింపుల్" అంటాను.

అది నిట్టూర్చి "టీ.వీ సీరియల్ సిట్టింగ్ రేపు పెట్టుకోకూడదా?" అంటుంది.

"పెట్టచ్చూ.. రైటర్స్ ఎసోసియేషన్.."

"మీటింగేగా ఒంట్లో బాలేదని చెప్పెయ్"

"ఊహూ! అలా పోయినసారి చెప్పాను. ఈసారి డ్రైవర్ రాలేదని చెప్తా."

"సరే. భారతి మంచిది. ఈ రోజు కుదరదని చేప్పేయ్."

"మరి త్యాగరాయ గానసభా?"

"నీకూ నాకూ పాటల గురించేం తెలుసే? అదీ మానెయ్. ఇంక డైలాగ్ అంటావా? సాయంత్రం ఆరింటికల్లా వెళ్ళి రాసెయ్. నువ్వు బంగారం, యమా ఫాస్ట్‌గా రాసేస్తావుగా"

"ఇంతకీ అన్నీ మానేసి ఏం చేద్దాం?"

"శిల్పారామంలో చీరల ఎగ్జిబిషన్‌కి వెళ్దాం. అక్కడి నుండి మహేష్ బాబు కొత్త సినిమాకి. మళ్ళీ వచ్చేవారం చెన్నై వెళ్తున్నాను. అక్క ఇంట్లో ఫంక్షన్. రేపటినుండీ సర్దుకుంటే కానీ ప్రయాణం కుదరదు" అంటుంది.

నేను పెద్దగా ఆలోచించకుండా సెల్‌లో "నాట్ ఫీలింగ్ వెల్ ప్రోగ్రామ్ పోస్ట్‌పోన్ టు టుమారో ప్లీజ్.. సారీ" అని వరుసగా నాలుగు పేర్లకి ఒకేసారి ఎస్.ఎమ్.ఎస్ పంపేస్తాను.

సో! పెద్ద ప్లాన్స్‌గా ఉండకండి.

***3. టైం టేబుల్ లాంటిది వేసుకున్నా పట్టించుకోకండి.***

ఇది చాలా ముఖ్యమైన పాయింట్. ఈ రోజు ప్రొద్దుటే లేచి తొమ్మిదికల్లా వంట చేసి, పదింటికల్లా తయారయ్యి టేబుల్ దగ్గర కూర్చుని 'ఓం సాయిరాం' అని విభూది పెట్టుకుని నవల రాసుకుంటూ కూర్చోవాలి. ఎమెస్కో లక్ష్మి తిడ్తోంది. ఎలాగైనా ఈ నెల నవల రాసి చూపించి 'షాక్ తినేట్లు చెయ్యాలి' అని ఎన్నోసార్లు అనుకుంటాను. బుర్రలో అయిడియాలూ, కథలూ లేక కాదు. పేపర్ మీద పెట్టడం బద్ధకం. సరిగ్గా అనుకున్నది అనుకున్నట్లు చేసి బల్లముందు కూర్చునేటప్పటికీ బెల్ టింగ్ టాంగ్ మని మోగుతుంది. తలుపు తెరిస్తే మేనల్లుడి భార్యో, అక్క కూతురో ముద్దుల మూటలు కట్టే బుజ్జిగాడిని చంకలో వేసుకుని వస్తారు.

"అదిగో అమ్మమ్మ అనో, అత్త అనో" వాడిని నాకిచ్చి సీరియస్‌గా కిచెన్‌లోకి వెళ్ళి "బోర్నవిటా ఉందా? ఫ్రిజ్‌లో ఫ్రూట్స్ ఉన్నాయా? మిల్క్ ఎందులో ఉంది?" అంటూ సీరియస్‌గా పిల్లాడికి అవి కలుపుకుంటూ, వాళ్ళాయన ఆఫీస్‌కి వెళ్తుంటే, నేను ఇంట్లో ఉన్నానని తెలిసి, ఎలా మస్కా కొట్టి ఇక్కడ దింపి వెళ్ళమన్నదీ చెప్తారు.

ఇంక కాయితాలు రెండు పడవలై నీళ్ళ టబ్బులో తేలుతుంటే, బుజ్జిగాడు చప్పట్లు కొడ్తుంటే, మురిసిపోయి అంతలోనే అవి నా నవలలో కాయితాలు అని తెలిసి, నుదురు కొట్టుకుని మిగతావి దాచుకోడానికెళ్తాను. ఈలోగా నా పెన్ వాడి చేతిలో 'పిల్లంగోర్' అవుతుంది. సాయంత్రం దాకా డయిపర్స్ మారుస్తూ వాడికి, వాడు 'గోవింద పెట్టడం' జేజిని చూపించడం. 'నీ కళ్ళేవీ.. ముక్కేది.. నోరేదీ' అని అడిగి వాడు కరెక్ట్‌గా చూపిస్తే మా మొహాలు ఆనందంతో 70 ఎం.ఎంలు అవడం. ఇదే ప్రహసనం. ఇలాంటి అనుకోని అవాంతరాలు వచ్చే ఆస్కారం ఎంతైనా ఉంది.

***4. కచ్చితంగా చేస్తానని ఏదీ అనకండి.***

"నేను రేపు ఉదయం పదిగంటలకి కచ్చితంగా వస్తాను సార్. హండ్రెడ్ పర్సెంట్" అని 'ఛ'కి ఒత్తు పెట్టి చాలా మంది చెప్తుంటారు మా సినీ ఫీల్డులో. ఎంత ఒత్తు పెడితే అంత అనుమానస్పదం అన్నమాట ప్రోగ్రామ్.

నాకు దారి తప్పిపోవడం అలవాటు. అహహ్. అడ్రెసులు కరెక్ట్‌గా తెలియక కాదు. ఒక్కోసారి ఏ పెద్ద ప్రొడ్యూసర్ దగ్గరో అపాయింట్ మెంట్ తీసుకుని కార్లో కులాసాగా హిందీ పాటలు వింటూ వెళ్తుంటానా, సడెన్‌గా ఫోన్ మోగుతుంది "రమణిగారూ ఏం చేస్తున్నారూ?" అని అపోలో నుండో, ఒమేగా నుండో నా డాక్టర్ ఫ్రెండ్స్ అడుగుతారు.

"కార్లో ఉన్నాను చెప్పండి. పదింటికి ఫలానా వాళ్ళ ఆఫీస్‌కి వెళ్ళాలి" అంటాను.

"ఒక్క ఐదు నిమిషాలు వచ్చి వెళ్తారా?. మన యూ.ఎస్. ఫ్రెండ్స్ కార్తీక్, గౌరీ వచ్చారు. నా దగ్గరే ఉన్నారు. మిమ్మల్ని చూడాలంటున్నారు." అంటారు.

"అరే! కార్తీకా, గౌరీనా? సరే వస్తున్నా - అని డ్రైవర్ని జూబ్లీ హిల్స్ కాదు హైదరగూడా" అంటాను. అప్పుడే ప్రొద్దుట లేట్‌గా వచ్చాడని డ్రైవర్ని తిట్టి ఉంటాను

"ఆయన చాలాపెద్ద ప్రొడ్యూసర్. మనం ఐదు నిమిషాలు లేట్ అయినా అపాయింట్‌మెంట్ కాన్సిల్ అవుతుంది. "

"మనకోసం వెయిట్ చేస్తారనుకున్నావా? నేను నీకోసం వెయిట్ చేసినట్లూ?" అనంటాను. డ్రైవర్ మొహం మాడిన గారెలా ఉంటుంది. ఛాన్స్ పోనివ్వడు " మరి.. ప్రొడ్యూసర్ గారో?" అంటాడు.

"నీకెందుకూ. నేను చూసుకుంటాలే. జస్ట్ ఐదు నిమిషాలే. డాక్టర్‌గారు పిలిచారు. వెళ్ళకపోతే బావుండదు. మొన్న నువ్వు గ్యాస్ ప్రోబ్లమ్‌తో బాధపడ్తుంటే పాపం మందివ్వలేదూ? అసలు ఆయన అపాయింట్ మెంట్ దొరకడానికే మిగతా వాళ్ళకి వారం పడ్తుంది" అంటాను.

డ్రైవర్ తొందరపడి మాట జారినందుకూ, అంతపెద్ద డాక్టర్ తనకి అపాయింట్‌మెంట్ లేకుండా చూసి మందు ఇచ్చినందుకూ పశ్చాతాపంతో కృంగిపోతాడనమాట.

ప్రొడ్యూసర్ నాకోసం చూసి చూసి ఫోన్ చేస్తాడు.

ఇక్కడ డాక్టర్‌గారి దగ్గర కాకినాడ కాజాలు గౌరీ వాళ్ళతో తింటూ "ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నాను సార్. ఎప్పుడు క్లియర్ అవుతుందో" అంటా. అక్కడి నుండి లంచ్‌కి వెళ్ళి, సాయంత్రందాకా వాళ్ళతో స్పెండ్ చేసి వస్తాను. అదీ సంగతి. అందుకే ఓ టైం టేబుల్ వేసేసుకుని ఖచ్చితమైన టైం పెట్టేసుకుని లైఫ్‌ని ఇనప చట్రంలో బంధించేసుకుని ఆనందాలు మిస్ అవకండి.

***5. ఆఖరుదీ మోస్ట్ ఇంపార్టెంట్‌దీ ఎఫ్.బీ.***

మీరు పనిచేసే చోట ఉండే మిత్రులెవరినీ, పొరపాటున కూడా మీ ఎఫ్.బీలో చేర్చుకోకండి. ఒకవేళ మహేష్ బాబు ఫోటోనో, సమంతా ఫోటోనో పెట్టి మిమ్మల్ని మాయచేస్తారేమో, మోసపోకండి. అసలు భావవీచికలూ, జాబిలికూనలు, పిల్లిపిల్లలూ లాంటి ఏ మారుపేర్లవాళ్ళనీ, వాళ్ళెవరో పర్సనల్‌గా తెలియకుండా చేర్చుకోకండి. అథవా చేర్చుకున్నా వాళ్ళు మీరు పనిచేస్తున్న సినిమా, ఆఫీస్, టీ.వీ సీరియల్, మొదలైన పనులతో సంబంధం ఉన్నవాళ్ళు అస్సలు కాకుండా చూస్కోండి ఎందుకంటే "నాకు ఒంట్లో బాలేదు. సారీ.. సిట్టింగ్ రేపటికి వాయిదా వెయ్యి" అని ఎస్.ఎమ్.ఎస్ చేసిన క్రియేటివ్ కన్సల్టెంట్ కానీ, ఎఫ్.బి.లో, "స్వీట్ కార్న్ అండ్ మిర్చీ బజ్జీస్ ఇన్ ఎగ్జిబిషన్" అని నేనూ, కాంతీ, పద్మజలతో తెగ నవ్వేస్తూ తింటున్న నేను పెట్టిన ఫోటో చూసిందనుకోండీ... బండారం బయట పడిపోతుంది. ఇంక ఛస్తే రెండోసారి నమ్మదు. ఎస్.ఎమ్.ఎస్ ఇస్తే "అయితే సిట్టింగ్ మీ ఇంట్లోనే పెట్టుకుందాం వస్తున్నాం" అంటుంది.

"ఈ రోజు గుమ్మడికాయ వడియాలు పెట్టాను" అని ఎఫ్. బీ.లో పెట్టి, సాయంత్రం డైరెక్టర్‌తో "ప్రొద్దుటి నుండీ బ్యాక్ ఏక్‌తో బెడ్ మీదున్నాను అస్సలు లేవలేదు తెలుసా?" అని అబద్దాలు చెప్పలేము. అందుకే ఈ జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి.

ఇంతకీ చెప్పొచ్చేదేవిటంటే ఈ రకమైన ప్లానింగ్‌తో టైం మేనేజ్ మెంట్ చేస్తా కాబట్టే నా ఎఫ్.బీ ఫ్రెండ్స్ అంతా 'జాటర్ ఢమాల్' అయిపోతూ "రమణీ వంటలు చేసి ఎఫ్.బీలో పెడ్తావు, ఫ్రెండ్స్‌తో తిరుగుతావు, బోలెడు పుస్తకాలు చదువుతావు, టీ.వీ.కీ, సినిమాకీ రాస్తావ్ ఇంకా కాలమ్ కూడా ప్రతినెలా టైంకి ఇస్తావు. మళ్ళీ బంధుగణంతో, ఫంక్షన్స్, సెలెబ్రేషన్స్, సినిమాలూ ఏవీ మిస్‌కావు. ఎలా.. ఎలా.. ఎలా? అని విస్తుపోతుంటారు. ఇవన్నీ చెయ్యగలగడానికి కారణం ఒక్కటే. ఇన్ డిసిప్లిన్.

అవును. గట్టిగా వందసీన్లు స్క్రీన్‌ప్లే నాలుగు రోజులు తల తిప్పకుండా రాసిస్తాను అని స్థిరనిర్ణయం చేసుకుని, వాకిట్లోకి పండు మిరపకాయలు రాగానే టెంప్ట్ అయి కాయితాలు పక్కన పారేసి కొరివి కారం పెట్టి ఎఫ్.బిలో పోస్ట్ చేస్తాను.

ఈ రోజు నవల కనీసం ముప్పై పేజీలు రాయాలి. మా లక్ష్మి నాతో "అమ్మాయ్.. బలభద్రపాత్రుని రమణి అనే పేరుగల రైటర్ బుక్స్ రావడం లేదు. ఆవిడ బతికే ఉందా? అని అడుగుతున్నారు తెలుసా?" అని కోప్పడింది.

ఒక బుక్ షాప్ ఓనర్ మల్లాదిగారింట్లో నన్ను చూసి ఎంతో ఆశ్చర్యపోయాడు (నేను బతికే ఉన్నందుకా) "మేడం మీ పుస్తకాల కోసం చాలా మంది అడుగుతుంటారు. ఎందుకు రాయడం లేదూ?" అన్నాడు. అలాంటప్పుడు రాయాలనిపిస్తుంది. కానీ మనసు కోతి. క్షణికానందాలకి లోబడి 'ఈ రోజు హసీతో,ఫసీ' సినిమా చూద్దాం. రేపటి నుండీ రాద్దాం" అనిపిస్తుంది.

అసలు మా ఆయన నా పెళ్ళయినప్పటినుండీ "ప్రొద్దుటే నిద్రలే బుర్ర ఫ్రెష్‌గా ఉంటుంది. బోలెడు బోలెడు రాయచ్చు" అని నన్ను సంస్కరించాలని చూస్తూనే ఉన్నారు. నేను అర్ధరాత్రి దాకా బ్లాక్ అండ్ వైట్ హిందీ సినిమాలకి ఎడిక్ట్ అయిపోయి, జీ క్లాసిక్‌కో, ఇంగ్లీషులో గ్రేస్ ఎనాటమీకో.. క్రైంథ్రిల్లర్స్‌కో తెల్లవారుఝామువరకు అతుక్కుపోయి, పదిగంటలకి లేస్తాను. ఇంకేం టైం ఉంటుంది?

ఈ వారం ఫ్రీ అనుకుని ఏ మల్లాది వెంకట కృష్ణమూర్తిగారింటికో వెళ్తే పద్మజ 'పరాయి సిరా' లేకపోతే 'గుడ్ బెటర్ బెస్ట్' లాంటి ఆయన లేటెస్ట్ బుక్స్ ఇస్తుంది. అంతే అవి కరకరా నమిలేసే వరకూ ఇక పుస్తకం వదలను.

"ఇలా చదివితే ఎప్పుడో స్టాఫ్ సెలెక్షన్ పాసయ్యేది" అని మా అమ్మ నా పెళ్ళయిన కొత్తల్లో అనేది.

"ఇప్పుడు మా ఆయన ఈ ఫేస్‌బుక్ చూసినంత సేపు, అప్పుడు క్లాస్‌బుక్స్ చూసి ఉంటే ఐ.ఏ.ఎస్ అయ్యేది మీ అమ్మ" అని పిల్లలతో అంటున్నారు.

పెళ్ళవకపోయినా, అయినా ఈ సాధింపు కామన్‌గా మిగిలిపోయింది.

ఈ పైన రాసిన టైం మిస్ మేనేజ్‌మెంట్ కోర్స్, ఇన్‌డిసిప్లిన్‌కి అరవై రెండు మార్గాలూ.. అన్నీ నా ప్రొఫెషన్‌లో మాత్రమే చెల్లుతాయండోయ్. మిగతా చాల ప్రొఫెషన్లలో కుదరవు. లాస్ట్ మినిట్‌లో అయినా నాలా డే అండ్ నైట్ వర్క్ చేసే నేచర్ మాత్రం కంపల్సరీ. లేకపోతే ఎవరూ పని ఇవ్వరు, దగ్గరకి రానివ్వరు.

నాకు చాలామంది సాహితీ మిత్రులున్నట్లే డాక్టర్ మిత్రులూ ఉన్నారు. చాలా మటుకు ట్విన్ సిటీస్‌లో ఉండే పెద్ద డాక్టర్లంతా తెలుసు. బహుశా అల్లు అరవింద్‌గారి బ్లడ్ బ్యాంక్ పనుల వల్ల ఆయన ద్వారా అయివుండచ్చు. అక్కినేని నాగేశ్వరరావుగారితో అనుబంధం వల్ల ఆయన ప్రోగ్రామ్స్‌లో పరిచయం అయిన వాళ్ళు అయి ఉండచ్చు.

కొంతమంది నా నవలలు చదివి నాకు ఫోన్ చేసిన వాళ్ళూ అయివుండచ్చు. మొత్తానికి చాలామందే ఉన్నారు. అందులో మా ఆంకాలజిస్ట్ (కాన్సర్ స్పెషలిస్టు) డా. మోహనవంశీ ఒకరు. ఆయన ప్రొద్దుట ఎనిమిదింటి నుండీ రాత్రి పదకొండున్నర, ఒక్కోసారి పన్నెండు వరకూ హాస్పటల్లోనే ఉంటారు. ఇంటికి వెళ్ళిన తర్వాత కూడా కాన్సర్ మీద జర్నల్స్ అవీ చదివి ఏ తెల్లారుఝామునో పడుకుంటారుట. అయినా నేను వెళ్ళి ఆయన్ని విసిగించి నా నవలకి కావలసిన మేటర్ రాబట్టాలని చూస్తూనే ఉంటాను అనుకోండీ.


డా. మోహనవంశీ

మొహంలో అలసటా, విసుగూ లేకుండా అదే చిరునవ్వుతో ఆయన ఓపిగ్గా నాతో మాట్లాడతారు. ఏ రోజైనా నేను వస్తున్నా అని ఫోన్ చేస్తే "ఈ రోజు బిజీ.. కుదరదు" లాంటి మాటలు అస్సలు మాట్లాడరు.

"విత్‌ప్లెజర్. రండి" అంటారు. ఆయన చీఫ్ ఫౌండర్ ఆఫ్ ఒమేగా హాస్పిటల్స్. ఆయన ఇంట్లో ఉండే సమయం ఎంతో నాకు తెలియదు. ఎప్పుడూ హాస్పటల్లో సేవలోనే ఉంటారు. ఇరవై నాలుగు గంటలూ కాన్సర్ చికిత్సకే సమయం కేటాయిస్తారు. అలాంటి వాళ్ళ నుండి నిజమైన క్రమశిక్షణ, నిజమైన అంకితభావం నేర్చుకోవాలి. ఆయన ఒక్క రోజు ఆలశ్యంగా లేచినా, ఆస్పత్రికి వెళ్ళక పోయినా కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని ఎదురు చూసే రోగులు ఎంత బాధపడ్తారూ?

మొన్న ఒక రోజు నవలకి ఏవో పాయింట్స్ రాసుకోడానికి ఆయన హాస్పటల్‌కి వెళ్ళాను. లిఫ్ట్‌బాయ్ నేను ఎక్కగానే పైకి తీసుకెళ్తూ ఆగి, "పేషెంట్‌ని అర్జెంట్‌గా రేడియేషన్‌కి దింపి వద్దాం. ఒకసారి కిందకెళ్ళొద్దాం మేడం" అన్నాడు. అలా కిందకీ పైకీ నాలుగుసార్లు తిప్పాడు.

ఈలోగా డాక్టర్ గారు "హాస్పిటల్లో ఎంటర్ అయి పదినిమిషాలు అయింది. ఇంకా నా రూంకి రాలేదేం?" అని అడిగారు.

"నేను ఆలశ్యంగా వస్తే ఈలోగా మీరు ఇంకో ఇద్దరు పేషెంట్స్‌ని చూస్తారు. పైగా నవల లేట్ అయితే ఎవరూ ఏమీ అయిపోరు. పేషెంట్స్‌కి లేట్ అయితే ప్రాణాలకే హాని - అందుకే మౌనంగా లిఫ్ట్‌బాయ్ పైకి కిందకీ లిఫ్ట్ తిప్పుతుంటే చూస్తూ ఊరుకున్నాను డాక్టర్" అన్నాను.

నేను వెళ్ళేటప్పుడు లిఫ్ట్‌బోయ్ "మళ్ళీ ఎప్పుడొస్తారు మేడం?" అని అడిగాడు స్నేహపూర్వకంగా. ఇది విని ఆయన విపరీతంగా నవ్వారు. "నన్ను అడిగితే అడిగావు. అందర్నీ ఇలా అడగకు కాన్సర్ హాస్పటల్లో" అని చెప్పాను. అక్కడ మనం చూడాల్సింది ఆ అబ్బాయి అమాయకత్వాన్ని.



అలాగే సినిమా వ్యాపారమే కాక ఇంకా బోలెడన్ని వ్యాపారాలతో బిజీగా ఉండే అల్లు అరవింద్‌గారు మొన్న నా తమ్ముడు లాంటి ఆదిత్యకి అర్జెంటుగా ఏదో పనిబడి ఆయన్ని కలవాలంటే ఫోన్ చేసాను.

"రేపటి అపాయింట్‌మెంట్స్ పి.ఏ.కి తెలుస్తాయి. ప్రొద్దుట గానీ చెప్పలేను" అన్నారు.

"నేను పదిన్నరకి వచ్చి పదకొండింటికి వెళ్ళిపోతాను" అన్నాను.

"సరే" అన్నారు.

ఆదిత్యని తీసుకెళ్ళాను. ఆయన మాట్లాడాక, ఆదిత్యతో "రమణిగారు అపాయింట్‌మెంట్ తీసుకోడం అంటే మాకు పెద్ద ఆప్షన్ ఉండదు. టైం ఆవిడే చెప్తారు. అపాయింట్‌మెంట్ ఇచ్చారో.. తీసుకున్నారో నాకు అర్ధం కాదు" అన్నారు. ఆదిత్యా నేను నవ్వాం. కానీ అది ఆయన గొప్పతనం. ప్రతి నిమిషం విలువైన అంత పెద్దాయన, అవసరం అనగానే మా కోసం టైం కేటాయించి, రెండు అపాయింట్‌మెంట్స్ మధ్య చిన్న గ్యాప్ సృష్టించి స్నేహాన్ని పాటించడం కూడా క్రమశిక్షణలోకీ, టైం మేనేజ్‌మెంట్లోకే వస్తుంది.

అక్కినేని నాగేశ్వరరావుగారికీ మీకూ ఉన్న అనుబంధం గురించి మాతో పంచుకోమని మొన్న కౌముది పాఠకులొకరు కోరారు. ఆయన సమయపాలన చాలా ఖచ్చితంగా ఉండేది. "నేను ఎన్నింటికి బయలుదేరాలి?" అని అడిగేవారు కాదు. "నేను ఎన్నింటికి అక్కడ ఉండాలి? " అని అడిగేవారు. మనం "పదిన్నర అంటే" ఆయన ఆ పూట ట్రాఫిక్ ఎలా ఉందో తెలుసుకుని చాలా ఎక్కువగా ఉంటే చాలా ముందుగా అక్కడినుండి బయలుదేరేవారు.



మొదటిసారి నేను మా ఆయనతో వెళ్ళినప్పుడు మేం అడ్రస్ వెతుక్కుంటూ ఆయనకి ఫోన్ చేస్తే "గుడిశల వెంకటస్వామిగారి ఇంటి పక్కన అని అడుగమ్మా. ఆయన అందరికీ తెలిసే ఉంటారు" అన్నారు. అంతే కానీ 'నా పేరు చెపితే నీకు జూబ్లీ హిల్స్‌లో ఎవరైనా చూపిస్తారు' అనలేదు. అదీ ఆయన గొప్పతనం.

మా అమ్మని ఓసారి అమ్మమ్మ పోయిన కొత్తల్లో చాలా మనసు బాగోలేదు అంటే నాగేశ్వరరావుగారి ఇంటికి తీసుకెళ్ళాను. అప్పటికి అన్నపూర్ణగారు కూడా బావున్నారు.

వచ్చేటప్పుడు ఎలా వచ్చారని అడిగారు.

'ఆటోలో వచ్చాం' అని నేను అంటే,

"ఉండండి నేను పంజాగుట్ట దగ్గర డ్రాప్ చేయిస్తా" అని నాగేశ్వరరావుగారు డ్రైవర్ కోసం చూసారు. అతను లేడు. "ఆలశ్యం అవుతోంది. రండమ్మా నేను తీసుకెళ్తాను" అని కారెక్కి స్టార్ట్ చేసారు.

మేం షాక్ అయినట్లు చూసాం.

నన్ను ముందు కూర్చోమని, మా అమ్మని వెనకాల కూర్చోపెట్టుకుని నాతో కబుర్లు చెపుతూ పంజాగుట్ట దాటి బేగంపేట ఆనంద్ థియేటర్‌దాకా వచ్చేసారు. నేను "ఆటోలు కనపడ్తున్నాయి. ఇంక చాలు ఇప్పటికే చాలా దూరం ట్రాఫిక్‌లో వచ్చేసారు" అని గోల పెట్టి దిగిపోయాను.

ఆ మహానటుడు అలా స్వంత డ్రైవింగ్‌లో మమ్మల్ని ఇంటికి దింపడం, నేనెన్నటికీ మర్చిపోలేను. "ఎంతో ఆనందంగా ఉంది" అని నేనంటే

"ఈ ఆనందం పరస్పరం అమ్మా. నువ్వు ఒద్దు అని పట్టు పడితే ఇది నేను మిస్ అయ్యేవాడిని" అన్నారు. నన్ను 'అత్తగారు' అనేవారు పుస్తకం అంకితం ఇచ్చానని.

"నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయీ.. ఏ కన్నీటి ఎనకాలా ఏముందో తెలుసునా?" అని నాకు ఆయన్ని తలుచుకుంటే ఏకకాలంలో ఆనందం, దుఃఖం సమానంగా వస్తున్నాయి. ఆయన్ని నేను ఆటపట్టించినంత ఎవరూ పట్టించరు అని ఓసారి అన్నారు.

మూవీ మొగల్ డా.పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ తీసుకున్న రామానాయుడు గారు, ఎక్కువ సినిమాలు తీసినందుకు ఒకసారీ, అన్ని భారతీయ భాషల్లో తీసినందుకు ఒకసారీ గిన్నీస్ బుక్‌లోకి ఎక్కిన ఘనత వారిది. ఆయన ఆఫీస్‌లో అపాయింట్‌మెంట్ తీసుకునే పద్ధతి లేదు. ఎందరొచ్చినా, ఏ రోజు వాళ్ళని ఆరోజు కలిసి మాట్లాడ్తారు. నేను ఆయన నిర్మాణంలో 'మధుమాసం', నేనేం చిన్నపిల్లనా' అనే రెండు సినిమాలకి కథ ఇచ్చాను. ఆయనతో ఓసారి "మనం ఇప్పుడు ప్రొడక్షన్ స్టార్ట్ అయి బిజీగా ఉన్నాం కదా కొన్నాళ్ళు విజిటర్స్‌ని ఎపాయింట్‌మెంట్ తీసుకోమని, ఒకవేళ అర్జెంటు అయితే మీట్ అవచ్చుగా ఎందుకిన్ని గంటలు ఆఫీసులో స్పెండ్ చెయ్యడం?" అన్నాను.

ఆయన నవ్వి "చూడు నాన్నా.. ఓ సంగతి నేర్చుకో. నా టైమే కాదు, వాళ్ళ టైం కూడా వాళ్ళు ఖర్చుపెడుతున్నారు. అందరూ పనిమీదే రారు. కొందరు "మిమ్మల్ని చూడాలని వచ్చాం సార్. మాది తిరుపతి, లేదా కావలి, బాపట్ల అంటారు. ఆ అభిమానానికి మనం ఏం ఇవ్వగలం? స్వంత బంధువుల్నే ఈ మధ్య అవసరం లేకపోతే చూడడం లేదు. ఇంటికెళ్తే టీ.వీ వైపు చూస్తూ మాట్లాడతారు. వీళ్ళు ఇంత శ్రమపడి నన్ను చూడడానికి వస్తుంటే రేపు రండీ, ఎల్లుండి రండీ అని ఎలా తిప్పమంటావు?" అన్నారు.



ఆయన టైం విషయంలో చాలా ఖచ్చితం. మేం రహస్యంగా 'హెడ్‌మాస్టర్' అని పిలుచుకునేవాళ్ళం. నేను సిట్టింగ్‌కి బయలుదేరితే (ఆయనే కారు పంపిస్తారు రైటర్స్‌కి) ఇక్కడ ఎన్ని గంటలకి బయలుదేరానో డ్రైవర్ని అడిగేవారు. నన్ను మధ్యలో ఎంత దూరం వచ్చానో అడిగేవారు. అక్కడ సురేష్ గెస్ట్‌హౌస్ మేనేజర్ని ఎన్ని గంటలకి దిగానో అడిగేవారు. దాన్ని బట్టి తరువాతసారి ఎన్ని గంటలకి బండి పంపాలో కరెక్ట్‌గా చెప్పేవారు.

అసిస్టెంట్ డైరెక్టర్లుగా ఉన్నప్పుడు కేవలం టైంకి వచ్చి క్రమశిక్షణ చూపించినందువల్లే బి.గోపాల్‌గారు, ఇ.వి.వి లాంటివారు మొదటిసారి ఆయన దగ్గర డైరెక్షన్ ఛాన్స్ పొందారని అంతా చెప్పుకుంటారు.

అలాంటి నాయుడుగారు "రమణికి గోంగూర ఇష్టం. మా ఇంట్లో కరివేపాకు వాసన బావుంటుంది అంటుంది" అంటూ నానక్‌రామ్‌గూడా వెళ్ళి, స్వయంగా పండించిన వంకాయలూ, గోంగూరా, టమాటాలూ, అపురూపంగా కోసుకొచ్చి నా కార్లో పెట్టించడం,

ఆ ఆప్యాయత డబ్బుతో కొనివ్వలేనిది. ఎప్పుడు ఫోన్ చేసినా "ఓసారి రామ్మా" అనేకానీ ఇంకో మాట ఉండదు. ఇంటికెళితే వాళ్ళావిడా అంతే ఆప్యాయంగా ప్రొద్దుట పూట వెళితే బ్రేక్‌ఫాస్టూ, భోజన సమయానికి వెళితే భోజనం చెయ్యమని ఆప్యాయంగా పెడతారు. రాజేశ్వరిగారిని ఆయన 'దేవత' అని చెప్తుంటారు. ఆయన కూడా నా అల్లరి ఓపిగ్గా భరించి "నీకు చిన్నతనం పోలేదమ్మా" అంటుంటారు.

ఇంతింత గొప్పవాళ్ళని కలవడం వాళ్ళతో సాన్నిహిత్యం... నా పూర్వజన్మ సుకృతాలే కానీ మరొకటి కాదు. అందుకే నేనెంత టైం మిస్ మేనేజ్ చేసినా చెల్లిపోతోంది అనుకుంట.

***మహానుభావులు ఊరకనే అవరు. పెద్ద పేరు తెచ్చుకోవాలంటే ఏం చెయ్యాలో వాళ్ళనుండి నేర్చుకోండి.***

Post your comments

